www.vaarthavedhikasurya.com
RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

SCAN ME

యాదాద్రి భువనగిరి | సోమవారం 17, నవంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 179 | పేజీలు: 08 | వెల: 5/-



# విరుగుడు లేని విషం

- ఆముదం గింజల్లో ప్రమాదకర రెసిన్.. 2 ఉప్పు రవ్వలంత రెసిన్ తిన్నా మనిషి మృతి
- ఈ విషానికి విరుగుడే లేదు
- తాజాగా రెసిన్‌పై జైషే కన్ను

**న్యూఢిల్లీ, నవంబరు 16 (వార్త వేదిక సూర్య):** రెండు ఉప్పు రవ్వలు ఎంత పరిమాణంలో ఉంటాయి? కంటికి అతి సమీపంలో పెట్టుకొని చూస్తే కానీ కనిపించనంత కదా? అంత తక్కువ పరిమాణంలో తిన్నా మనిషిని చంపగల విషం ఒకటుంది.. అదే రెసిన్. ఈ విషానికి ప్రపంచంలో ఎక్కడా విరుగుడే లేదు. అది శరీరంలోకి వెళ్తే 36 నుంచి 72 గంటల్లో మనిషి చనిపోతాడు. మనదేశంలో వి?ధ్వంసం సృష్టించాలని కుట్రలు చేస్తున్న ఉగ్రవాదులు ఇప్పుడు ప్రమాదకరమైన ఈ విషంపై కన్నేశారు. ఇటీవల గుజరాత్ ఉగ్రవాద నిరోధక విభాగం (ఏటీఎస్) పోలీసులు అరెస్టు చేసిన హైదరాబాదీ వైద్యుడు మొహియుద్దీన్ రెసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు తేలటంలో నిఘా, దర్యాప్తు వర్గాలు ఉలిక్కిపడ్డాయి.

**ఆముదం గింజల నుంచి తయారీ..**

రెసిన్‌ను ఆముదం గింజల నుంచి తయారుచేస్తారు. దీనిని సాధారణ వ్యక్తులు తయారుచేయటం అంత తేలిక కానప్పటికీ అసాధ్యం మాత్రం కాదని నిపుణులు చెబుతున్నారు. ఆముదం గింజలను గుజ్జుగా మార్చి ప్రత్యేక విధానంలో దాని నుంచి రెసిన్‌ను తీస్తారు. ఇటీవల గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేసిన మొహియుద్దీన్ వద్ద 4 కిలోల ఆముదం గుజ్జు లభించటంతో తీగ లాగగా రెసిన్ తయారీ విషయం బయటపడింది.

**తేలికగా లభ్యం**

సాధారణంగా ఆముదాలు ఎవరికైనా తేలికగా లభిస్తాయి. మనదేశంలోని చాలా రాష్ట్రాల్లో రైతులు ఆముదం పంట పండిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని మెట్ట ప్రాంతాల్లో కొంతకాలం క్రితం వరకు ఇది ప్రధాన పంటగా ఉండేది. హైదరాబాద్‌లోని మూసీ నది వెంట చిత్తడి ప్రాతాల్లో ఆముదం మొక్కలు విరివిగా పెరుగుతాయి. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ ఆముదాలు అమ్ముతున్నారు. ఎందుకు, ఏమిటి అనే ప్రశ్నలు వేయకుండానే ఆర్డర్ చేసిన వెంటనే ఇంటికే డెలివరీ చేస్తున్నారు. ఇప్పటివరకు ఉగ్రవాద వ్యతిరేక దర్యాప్తు సంస్థలుగానీ, నిఘా వర్గాలుగానీ, ప్రభుత్వాలుగానీ ఎవరైనా రెసిన్‌ను దుర్వినియోగం చేస్తే ఎలా అనే అంశంపై పెద్దగా దృష్టి పెట్టలేదు.

మిగతా 2లో..



# చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం



- తెలంగాణ, ఏపీ అభివృద్ధికి సహకరిస్తా
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీఆర్
- తెలుగు భాష సంరక్షణకు కృషి: చంద్రబాబు

**హైదరాబాద్,నవంబరు 16 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న చిన్న చిన్న సమస్యలను ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కలిసి అడుగులు వేస్తే రెండు రాష్ట్రాలూ అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఇరు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆదివారం రామోజీ ఫిలింసిటీలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప రాష్ట్రపతి హాజరయ్యారు. దేశంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజ హితమే లక్ష్యంగా పనిచేస్తున్న వారికి ఈ అవార్డులను రాధాకృష్ణన్ చేతులమీదుగా అందజేశారు. అవార్డు గ్రహీతలకు మొమెంటో, ప్రశంసా పత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నగదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు

మిగతా 2లో..

# ఐ బొమ్మ క్లోజ్

**బప్పం టీవీ కూడా బంద్**

**తమను సవాలు చేసిన ఇమ్మడి రవితోనే ఆ వెబ్‌సైట్లు మూసివేయించిన పోలీసులు**

**రవి ఇంటి పేరే ఐ బొమ్మలో 'ఐ'.. రవిని కస్టడీకి కోరుతూ పోలీసుల పిటిషన్**

**రవి ఇలా ఎందుకు చేశాడో మాకు తెలీదు : రవి తండ్రి అప్పారావు**

**హైదరాబాద్,నవంబరు 16 (వార్త వేదిక సూర్య):** ఐ బొమ్మ, బప్పంటీవీల్లో పైరసీ సినిమాల ఆట ముగిసింది. 'మా దగ్గర కోట్ల మంది డేటా ఉంది. మా మీద ఫోకస్ చెయ్యకండి, మమ్మల్ని ఆపలేరు.. వెతకలేరు' అంటూ గతంలో తమకు సవాలు విసిరిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవితోనే పోలీసులు ఆ వెబ్‌సైట్లను మూసి వేయించారు. ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసిన సైబర్ క్రైం




పోలీసులు.. అతడి వద్ద నుంచి వెబ్ లాగిన్‌లు, సర్వర్ వివరాలు తీసుకొని అతనితోనే ఆయా సైట్లను మూసివేయించారు. పోలీసులు సాధించిన ఈ విజయంపై సినీ పరిశ్రమ నుంచిప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు అతడికి రిమాండ్ విధించింది. అయితే, కేసు దర్యాప్తులో భాగంగా రవిని మరింత లోతుగా విచారించేందుకు ఏడు రోజుల కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. రవిని అదుపులోకి తీసుకొని లోతుగా విచారిస్తే..ఈ పైరసీ వ్యవహారం వెనక ఇంకెవరు ఉన్నారో తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. కాగా, రవిపై నమోదైన తీవ్ర నేరం దృష్ట్యా అతనికి ఇప్పట్లో బెయిల్ వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

**ఐ బొమ్మలో ఐ అంటే ఇమ్మడి**

ఏపీలోని విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి తన ఇంటి పేరులోని మొదటి అక్షరం ఐ ని తీసుకొని ఐ బొమ్మ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించాడు. ముంబైలో ఎంబీఏ పూర్తి చేసిన ఇమ్మడి రవి.. రెండు ఐటీ సంస్థలకు సీఈవోగా పని చేశాడు. కొన్నేళ్లకు ఆ ఉద్యోగం మానేసి నేరాల బాటపట్టాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లాడిన రవి.. ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు.

మిగతా 2లో..

# మరోమారు కేంద్రంపై ఒత్తిడి తెద్దామా

**కోర్టు సూచన మేరకు ఎన్నికలకు వెళదామా?**

**సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి బీసీలకు 42% కోసం పోరాడదామా?**

**నేడు క్యాబినెట్ భేటీ.. స్థానిక ఎన్నికలపై చర్చ**



**హైదరాబాద్,నవంబరు 16 (వార్త వేదిక సూర్య):** పంచాయతీల పాలక మండళ్ల గడువు ముగిసి చాలా కాలమైనా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడి నెలకొని ఉంది. మరోవైపు ఈ కారణంతో కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.3 వేల కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండిపోయాయని పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వానికి చెబుతూ వస్తోంది. అయితే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోంది. 42 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను నిలిపివేస్తూ హైకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న దానిపై సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకోనుంది. దీంతోపాటు వివిధ అంశాలు, కార్యక్రమాలకు సంబంధించి పాలన, విధాన పరమైన నిర్ణయాలు

మిగతా 2లో..



# వణికిస్తున్న చలి

- రాష్ట్రంలో మరింత పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- ఆదివారం అత్యల్పంగా సిర్పూర్‌లో 7.4 డిగ్రీలు
- 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. ఇతర జిల్లాలకు యెల్లో అలర్ట్
- శేరిలింగంపల్లిలో 10 డిగ్రీలకు పడి పోయిన ఉష్ణోగ్రతలు
- రాబోయే రెండుమూడు రోజులు మరింత చలి
- వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్,నవంబరు 16 (వార్త వేదిక సూర్య):** తెలంగాణలో చలి తీవ్రత పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని

మిగతా 2లో..

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు..**

## నేడు సుప్రీంలో విచారణ

- గత నెల 31తో ముగిసిన గడువు.. పొడిగించాలని కోర్టును కోరిన స్పీకర్
- స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ కేటీఆర్ పిటిషన్
- ఆ 10 మందిని అనర్హులుగా ప్రకటించాలని మరో పిటిషన్

**న్యూఢిల్లీ, నవంబరు 16 (వార్త వేదిక సూర్య):** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్‌కు ఇచ్చిన

మిగతా 2లో..






# బిహార్ సీఎంగా నితీశే!

- 19 లేదా 20న ప్రమాణ స్వీకారం
- మంత్రివర్గ ఫార్ములా కూడా ఖరారు!
- బీజేపీకి 15-16బీ జేడీయూకు 14 పదవులు

**న్యూఢిల్లీ, నవంబరు 16:** బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమారే కొనసాగుతారా? మరోసారి ఆయనే సీఎంగా బాధ్యతలు చేపడతారా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ నెల 19 లేదా 20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుందని చెబుతున్నాయి. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో జరిగిన సమావేశంలో బిహార్ మంత్రివర్గ ఫార్ములాను ఖరారు చేసినట్లు సమాచారం. నితీశ్‌నే సీఎంగా కొనసాగించాలని ఆ భేటీలో నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలో సింహభాగం పదవులు బీజేపీకే దక్కనున్నట్లు తెలుస్తోంది. 15-16 పదవులు కాషాయ పార్టీకి, 14 పదవులు జేడీయూకు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ పార్టీ ఎల్జేపీకి మూడు, మరో కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝి పార్టీ

మిగతా 2లో..



# హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం..

### ఎలక్ట్రిక్ కారులో చెలరేగిన మంటలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పార్కింగ్ చేసిన ఎలక్ట్రిక్ కారులో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్, స్థానికులు కలిసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నిమిషాల వ్యవధిలో కారు పూర్తిగా దగ్ధమైంది. ఇక పక్కనే ఉన్న మరో కారుకు మంటలు వ్యాపించే క్రమంలో.. అప్రమత్తమైన డ్రైవర్.. ఆ వాహనాన్ని అటు నుంచి పక్కకు తీశారు. ఈ అగ్నిప్రమాద ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకోవడానికి రామోజీరావు స్ఫూర్తితో పనిచేస్తామని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఇతర ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే ఇస్తామని ప్రకటించారు.

**విశేష కృషికి పురస్కారాలు..**

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతల్లో.. చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి జలసంరక్షణతో 18 లక్షల మంది గ్రామీణ ప్రజల జీవితాలను మార్చిన అమ్లా అశోక్ రుయాకు గ్రామీణాభివృద్ధి



విభాగంలో అవార్డు దక్కింది. వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న శ్రీకాంత్ బొల్లాకు యూత్ ఐకాన్‌గా, ప్రపంచంలోనే ఎత్తైన కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను డిజైన్ చేసిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ మాధవీలతకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పురస్కారాలు అందజేశారు. కాగా, మురికివాడల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి.. వారి జీవితాల్లో మార్పు తెచ్చిన ఆకాశ్ టాండన్‌కు మానవతా సేవల విభాగంలో, కళలు-సంస్కృతి విభాగంలో సత్తుపతి ప్రసన్నకు, జర్నలిజంలో కృషికిగాను జైదీప్ హర్దేకర్‌కు, మహిళా సాధికారత కోసం పాటుపడిన పల్లబీ ఘోష్‌కు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్, (వార్త వేదిక సూర్య):**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి, చింతగుప్ప పోలీసు స్టేషన్ల పరిధిలోని తుమ్మలపాడు అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. తుమ్మలపాడు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందుకున్న డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గ్రూప్స్ (డీఆర్‌జీ) బలగాలు అక్కడకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఇరుపక్షాల నడుమ ఎదురుకాల్పులు జరిగినట్టు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ పేర్కొన్నారు. కాల్పుల్లో కుంట ఏరియా కమిటీ జన్ మిలీషియా కమాండర్ మడవి దేవా, కిష్టారం ఏరియా కమిటీ ఏసీఎం సోడి గంగి, కుంట ఏరియా కమిటీ ఏసీఎం పొడియం గంగి మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరిం చారు. వీరి తలలపై ఒక్కొక్కరికి రూ.5 లక్షల వంతున రివార్డు ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల కుంట ఏఎస్పీ ఆకాషరావ్ గిరిపుంజను హత్య చేసిన ఘటనలో ప్రధాన పాత్ర మడవి దేవాదేనని పోలీసుల కథనం. ఘటనా స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# మరోమారు కేంద్రంపై ఒత్తిడి తెద్దామా

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునేందుకు సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. ప్రధానంగా స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణపైనే ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. కాగా, క్యాబినెట్ భేటీ కోసం స్థానిక ఎన్నికల పరిస్థితిపై పంచాయతీరాజ్ శాఖ సవివరమైన నోట్‌ను సిద్ధం చేసి ఉంచింది. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, కేంద్ర నిధులు పెండింగ్‌లో ఉండడం, డిసెంబరు 1 నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం తుది ప్రయత్నాలు చేపట్టే అవకాశం వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం సమీక్షించనుంది.

**అఖిలపక్ష పార్టీలతో ఢిల్లీకి**




బీసీల రిజర్వేషన్ కోసం పార్లమెంటు సమావేశాల సందర్భంగా అఖిలపక్ష పార్టీలు, సంఘాలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానిని కలవడం, పార్లమెంటు వేదికగా ఒత్తిడి తేవడం వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. దీంతోపాటు హైకోర్టు సూచన మేరకు పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లి.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తొలుత గ్రామపంచాయతీల వరకు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నింటినీ సమీక్షించి.. స్థానిక ఎన్నికలపై క్యాబినెట్ ఓ నిర్ణయానికి రానుంది. కాగా.. డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025, ప్రజా ప్రభుత్వ విజయోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపైనా సమీక్షించనున్నారు. వందేళ్ల ప్రగతికి రోడ్ మ్యాప్ కోసం రూపొందించనున్న తెలంగాణ రైజింగ్ - 2047 డాక్యుమెంట్ రూపకల్పనపైనా చర్చించనున్నారు.

# ఐ బొమ్మ క్లోజ్

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లి ఐబొమ్మ కార్యకలాపాలు మొదలు పెట్టాడు. కొత్త సినిమాని విడుదలైన రోజే దొంగచాటుగా థియేటర్లలో వీడియో తీయించడం, వాటిని వెంటనే ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం చేస్తుండేవాడు. అలాగే ఓటీటీలో విడుదలైన సినిమాలను కూడా హెచ్‌డీ ప్రింట్‌తో ఐబొమ్మలో అప్‌లోడ్ చేసేవాడు

. ఐబొమ్మ దెబ్బకు సినీ నిర్మాతలు, ఓటీటీ సంస్థలు తీవ్రంగా నష్టపోయేవి. ఈ క్రమంలో సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తుల మేరకు ఐబొమ్మపై తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. దీంతో మమ్మల్ని ఆపలేరు, వెతకలేరు అంటూ పోలీసులను సవాలు చేస్తూ ఐబొమ్మ వెబ్‌సైట్‌లో రెండేళ్ల క్రితం ఓ పోస్టు ప్రత్యక్షమైంది. ఈ పోస్టు సోషల్ మీడియాలో దుమారమే రేపగా.. కేసును పోలీసులు మరింత సవాలుగా తీసుకున్నారు. అయితే, పోలీసు నిఘా పెరగడంతో తెలివి ప్రదర్శించిన రవి బప్పం టీవీ పేరిట మరో ఖాతా ప్రారంభించి కొంతకాలంగా అందులో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నాడు. ఐబొమ్మ నిర్వాహకులను ఎలాగైనా పట్టుకుంటామని మూడు




నెలల క్రితం అప్పటి హైదరాబాద్ సీపీ ఆనంద్ కూడా ప్రకటించారు.

ఈ క్రమంలో నెదర్లాండ్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇమ్మడి రవిని.. కూకట్‌పల్లిలోని అతడి నివాసంలోనే అరెస్టు చేసిన పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. కాగా, కూకట్‌పల్లిలోని రెయిన్‌బో విస్టా ఫేజ్-2 అపార్ట్‌మెంట్‌లో రవికి ఓ ఫ్లాట్ ఉందని పోలీసులు గుర్తించారు.

రవి అప్పుడప్పుడు అక్కడికి వచ్చి వెళుతుంటాడని, రవికి సంబంధించిన ఇతర వివరాలు తమకు తెలియని ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు తెలిపారు.

**ఎందుకు ఇలా చేశాడో తెలియదు**

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి తండ్రి ఇమ్మడి అప్పారావు విశాఖపట్నంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రవి ఎందుకు ఇలా చేశాడో తమకు తెలియదని చెప్పారు. రవి రాంగ్ రూట్‌లో వెళ్లాడని, ఆ సంగతిని ఇక పోలీసులే చూసుకుంటారని పేర్కొన్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నాక ఆమె నుంచి విడాకులు తీసుకున్నాడని తెలిపారు.

# విరుగుడు లేని విషం

(మొదటి పేజీ తరువాయి)

**విరుగుడే లేదు..**

రెసిన్ విషానికి ఇప్పటివరకు సరైన విరుగుడే లేదని వైద్యులు తెలిపారు. శరీరంలో ఈ విషం ఉందా లేదా? అనేది నిర్ధారించటం కూడా అంత తేలిక కాదని చెబుతున్నారు.



'శరీరంలో రెసిన్‌ను గుర్తించటానికి లిక్విడ్ క్రోమటోగ్రఫీ వంటి ప్రత్యేక పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఈ పరీక్షలు ఒకేసారి ఎక్కువ మందికి నిర్వహించటం సాధ్యం కాదు. రోగికి ఉన్న లక్షణాలను బట్టి తెలుసుకోవాల్సి ఉంటుంది. శ్వాస సంబంధ లక్షణాల ద్వారా రెసిన్ దాడిని తెలుసుకోవటం కాస్త తేలిక. రెసిన్‌కు విరుగుడు లేదు. ఇతర మార్గాల ద్వారా రోగిని బ్రతికించటానికి ప్రయత్నించాల్సిందే. అది కూడా రోగి ఎలా స్పందిస్తున్నాడు అనేదానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. రెసిన్‌ను ముక్కు ద్వారా పీల్చితే త్వరగా చనిపోతారు' అని ఢిల్లీలోని గంగారామ్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నీరజ్ త్యాగి తెలిపారు.

**రెండు రవ్వలు చాలు:** రెసిన్ కలిసిన రెండు రవ్వల ఉప్పు తిన్నా మనిషి చనిపోతాడు.

**రూపం:** రెసిన్‌ను పౌడర్‌గా, తేలికగా ఆవిరయ్యే సెమీ లిక్విడ్ (పొగమంచులాగా)గా, పెల్లెట్లుగా కూడా తయారు చేయవచ్చు. ఇది నీటిలో, మామూలు యాసిడ్‌లో తేలికగా కలిసిపోతుంది.

**ఎలా పనిచేస్తుంది?:** శరీరం జీవ కణాలతో నిర్మితమై ఉంటుంది. ఆ కణాల మనుగడకు ప్రొటీన్ అవసరం. రెసిన్ శరీరంలోకి వెళ్లగానే జీవకణాల్లోకి ప్రొటీన్ వెళ్లకుండా అడ్డుకుంటుంది. దీంతో జీవకణం చనిపోతుంది. అలా శరీరంలోని ఒక్కో అవయవం పాడవుతుంది. చివరకు రెసిన్ శరీరంలోకి ప్రవేశించిన 36 నుంచి 72 గంటల్లో (విషం శరీరంలోకి ప్రవేశించే విధానాన్ని బట్టి) మనిషి మరణిస్తాడు.

**గతంలో బయటపడిన 'రెసిన్' ఘటనలు..**

1978 సెప్టెంబర్‌లో లండన్‌లో బల్గేరియన్ తిరుగుబాటు నేత జార్జీ మార్కోవ్‌ను రెసిన్ పెల్లెట్ పేల్చి హత్యచేశారు.

2024 జూలైలో బ్రిటన్‌లోని సౌత్‌పోర్ట్ ప్రాంతంలో కత్తి పోట్లకు పాల్పడిన దుండగులు రెసిన్‌ను కూడా తయారు చేసేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో బయటపడింది.

2000 సంవత్సరం సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వచ్చిన ఒక పార్సిల్‌లో రెసిన్‌ను గుర్తించారు.

2018 జూన్‌లో జర్మనీలోని కలాగ్నేలో సైఫ్ అల్లాహ్ అనే ఓ ట్యునీషియా జాతీయుడు, అతడి భార్య కలిసి ఇంట్లోని వంటగదిలోనే కాఫీ గ్రైండర్ ద్వారా రెసిన్‌ను తయారుచేసేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. వీరు భారీ మొత్తంలో ఆముదం గింజలను కొనటంతో అనుమానం వచ్చిన పోలీసులు.. వారి ఇంట్లో సోదాలు చేయగా విషయం బయటపడింది. వీరికి ఐఎసఐఎస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

**లక్షణాలు:**

ముక్కుద్వారా రెసిన్ శరీరంలోకి వెళ్తే శ్వాస తీసుకోటంలో తీవ్ర సమస్య ఏర్పడుతుంది. దీంతో రోగి త్వరగా మరణిస్తాడు.

నోటిద్వారా రెసిన్‌ను తీసుకుంటే వాంతులు, విరేచనాలు అవుతాయి. కాలేయం, మూత్రపిండాలు త్వరగా పాడవుతాయి.

ఇంజెక్షన్ ద్వారా ఇది శరీరంలోకి వెళ్తే అవయవాలన్నింటినీ త్వరగా నాశనం చేస్తుంది.

# బిహార్ సీఎంగా నితీశే!

(మొదటి పేజీ తరువాయి)

హిందుస్థానీ అవామ్ మోర్చా(హెచ్‌ఏఎం)కు ఒకటి, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఒకటి చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

**ఇదీ ప్రక్రియ..**

బిహార్‌లో 18వ అసెంబ్లీ ఏర్పాటుకు సంబంధించి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు వివరిస్తారు.

సోమవారం నితీశ్‌కుమార్ క్యాబినెట్ సమావేశం నిర్వహిస్తారు. 17వ శాసనసభను రద్దు చేస్తూ తీర్మానం ఆమోదిస్తారు.

అనంతరం ఆయన తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. కూటమి నేతలు సమావేశమై ఎన్డీయే శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. బుధ లేదా గురువారం సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని భావిస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ షెడ్యూల్‌ను బట్టి ప్రమాణ స్వీకార తేదీని ఖరారు చేయనున్నారు. నితీశ్ పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణం చేయనుండడం విశేషం. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరుకానున్నారు.

# వణికిస్తున్న చలి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్ నగరంలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు 7 - 11 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. రాబోయే మూడు రోజులకుగాను 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్, నిర్మల్, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, ములుగు జిల్లాల్లో 6-10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 10 డిగ్రీ సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్ర నమోదైంది. శివారు ప్రాంతాలు, వృక్షాలు అధికంగా ఉన్న చోట ఉదయం పూట పొగమంచు దట్టంగా అలముకుంటోంది.

# 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీకి సర్వం సిద్ధం

**67లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండేసి చీరలు**

**ఇందిరాగాంధీ జయంతి రోజున ముహూర్తం**

**ఇప్పటికే జిల్లాల్లోని గోదాములకు సరఫరా**

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):**

ఇందిరాగాంధీ మహిళా శక్తి పథకం కింద రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈనెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల(ఎసహెచ్‌జీ) మహిళకు రెండేసీ చీరలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అన్ని జిల్లాల గోదాములకు చీరలు చేరుకున్నాయి. ఇందుకు సంబంధించిన డిజైన్లను చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెస్కో రూపొందించింది. వాటి ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. నాణ్యమైన చీరలను అందించే దిశగా పలు చర్యలు తీసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్ల నేతన్నలకు ఉపాధినిచ్చాయి. అయితే, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక చీరల్లో నాణ్యత లేదన్న కారణంతో వాటి పంపిణీ నిలిపివేసింది. దీంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది. నేతన్నల ఆత్మహత్యలు, ఆందోళనలు వంటి పాత పరిస్థితులు పునరావృతం అవుతాయన్న ఆందోళన నేపథ్యంలో.. బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని...**

స్వశక్తి మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా, సిరిసిల్లలో మరమగ్గాలు ఎక్కువగా ఉండడంతో అక్కడి వస్త్ర పరిశ్రమకే ప్రభుత్వం ఎక్కువ ఆర్డర్లు ఇచ్చింది. దీంతో సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఉపాధి భరోసానిస్తున్నాయి. గతంలో జీవనోపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిన అనేక మంది కార్మికులు ఇప్పుడు గ్రామాల్లోనే చేతి వృత్తిలో నిమగ్నమయ్యారు. దీంతో



మరమగ్గాల చప్పుళ్లు మొదలయ్యి, నేతన్నలకు చేతినిండా పని దొరికింది. జిల్లాలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మ్యాక్స్)ల ద్వారా 9,600 మరమగ్గాలపైన 1.3 కోట్ల చీరల ఉత్పత్తి కొనసాగుతోంది. మొదట్లో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో చీరల ఉత్పత్తి వేగంగా జరగలేదు. క్రమంగా లక్ష్యం దిశగా.. వేగాన్ని పెంచడంతో చివరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. మొత్తం 4.30కోట్ల మీటర్ల మేర వస్త్రం అవసరమవుతుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటికే 3.2 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తిని పూర్తిచేసి చివరి దశకు చేరుకున్నారు.

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు.. నేడు సుప్రీంలో

# విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులపై విచారణకు సుప్రీంకోర్టు గతంలో విధించిన గడువు అక్టోబర్ 31వ తేదీతో ముగిసింది. దీంతో మరో 8 వారాలు గడువు పొడిగించాలని అదేరోజు స్పీకర్ కార్యాలయం కోర్టును కోరింది. రోజువారీ కార్యాక్రమాలు, స్పీకర్ల అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనలు తదితర కార్యక్రమాల్లో స్పీకర్ బిజీగా ఉన్నందున గడువులోగా విచారణ సాధ్యంకాలేదని తెలిపింది. మరోవైపు స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే విచారణ ఆలస్యం చేస్తున్నారని, అందువల్ల స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



అలాగే, ఆ పదిమంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు అన్నింటినీ కలిపి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించనుంది. విచారణకు స్పీకర్‌కు మరికొంత సమయం ఇస్తారా? ఇస్తే ఎంత సమయం ఇస్తారు? అనేదానిపై సోమవారం స్పష్టత రానుంది. కాగా, ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంతవరకూ స్పీకర్ విచారించలేదనే అంశంపైనే బీఆర్ఎస్ వాదనలు వినిపించే అవకాశం ఉంది. 24న సీజేఐ పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారా? మరో ధర్మాసనం వద్దకు పంపుతారా? అనే అంశంపై ఆసక్తి నెలకొంది.






# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కోరుట్ల, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** జెడ్ పి హెచ్ ఎస్ మోహన్ రావుపేట 2002-03 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు 22సంవత్సరాల తరువాత వెంకటాపూర్ పంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబోధన చేసిన గురువులకు ఘన సన్మానం నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన స్నేహితులు డా..బేతి మధు, శ్రీగద్దె మహేష్, లింగాల రాజశేఖర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్నేహితులు చిన్నప్పుడు కలిసి ఆడిన ఆట-పాటలు, తరగతి గదిలో జరిగిన సరదా సంఘటనలు గుర్తు చేసుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. చాలాకాలం తర్వాత అందరూ కలుసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని పేర్కొన్నారు.పూర్వ విద్యార్థులు స్నేహితులు కీ. శే లు ద్యాగ శ్రీను, మరిపెల్లి రాజేష్ లకు నివాళులు అర్పించారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** క్రీడలు దేహదారుఢ్యం తో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల




మైదానంలో జరుగుతున్న కోకో పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలలో క్రీడాకారుల కోటను త్వరలోనే భర్తీ చేసే ఆలోచనతో ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, అన్నం అనిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజమ్ కోకో క్రీడా నిర్వాహకులు స్థానిక మాజీ కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ వాసం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి భూమి పూజలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** కోరుట్ల పట్టణంలోని 32 వ వార్డులో శనివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ



సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అధికారులతో కలసి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు జువ్వాడి కృష్ణారావుతోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం , అన్నం అనిల్, మాజీ కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, వాసం అజయ్ తదితరులు పాల్గొన్నారు

# అనారోగ్యంతో ఉన్న చంద్రగిరి ప్రవీణ్

**పరామర్శించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్**

**గుండాల మండలం, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన చంద్రగిరి శ్రీనివాస్ తన కుమారుడు ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిన ఆలేరు బ్లాక్



కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ హాస్పటల్ కు వెళ్లి చంద్రగిరి ప్రవీణ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వారికి తక్షణమే 25 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు.

ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో రెండు లక్షల 50 వేలు ఎల్ఓసి ఇప్పించడం జరిగింది. వారి వెంట దొడ్డి బోయిన నరేష్ బీసు పరశు రాములు చంద్రగిరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**బిఎస్పి మండల అధ్యక్షులు నకిరేకంటి నరేష్**

**రామన్నపేట, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** జర్నలిస్టులందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు అన్ని కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులలో జర్నలిస్ట్ హెల్త్ స్కీం అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు నకిరేకంటి నరేష్ అన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాధన ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని, జర్నలిస్టు లేకపోతే తెలంగాణ ఉద్యమం తారాస్థాయికి చేరేది కాదని అన్నారు. ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు జర్నలిస్టుకి హెల్త్ కార్డులు అమలయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే తెలంగాణ సాధించుకుని 11 ఏళ్లు గడుస్తున్న ఇంతవరకు జర్నలిస్టులకు



న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. హెల్త్ కార్డులు అమలు కాక అనేకమంది జర్నలిస్టులు అకాల మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే కార్పొరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేలా జర్నలిస్టులో హెల్త్ స్కీమ్ అమలయ్యేలా చూడాలని సూచించారు. మండలంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్లల్లో ఉంటూ అనేక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న జర్నలిస్టులకే న్యాయం జరగకపోవడం శోచనీయమని అన్నారు.

ఇప్పటికైనా ఇప్పుడు ఉన్న ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

# హలో కామ్రేడ్ చలో ఖమ్మం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యానాల దామోదర్ రెడ్డి**

**వలిగొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం ఎల్లంకి మహేష్ అధ్యక్షన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యానాల దామోదర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. భారత్ గడ్డపై సిపిఐ భారత్ కమ్యూనిస్ట్ పార్టీ వంద సంవత్సరంములు నిండి నూట ఒక్కటివ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భము డిసెంబర్ 26న ఖమ్మం నడిబొడ్డున జరుగు శత జయంతి ఉత్సవాల ముగింపు సభకు పార్టీ సభ్యులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 1925 డిసెంబర్ న అభర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని గర్జించి బ్రిటిష్ వారి నుండి మన దేశ విముక్తి కోసం రాజీలేని పోరాటాలు జరిపింది ఆనాడు నిషేధం విధించింది కాన్పూర్ విరోట్ పెషధర్ కేసులు పెట్టి నాయకులను జైళ్ళలలో నిర్బంధించారు, అయినప్పటికీ అన్ని వర్గాల ప్రజలను చైతన్య పరిచి ప్రజాసంఘాలను నిర్మించి దేశ విముక్తి కొరకు పోరాటం చేసింది. తదనంతరము భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి, నిజాంను గద్దె దించటానికి జరిగిన తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో 4500మంది అమరులైన అదరక బెదరక పోరాటం చేసి నిజం నవాబును ప్రారదోలి 10 లక్షల భూమిని పంచి, 3000 గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది గరీబ్ హటావో అని చెప్పి బ్యాంకులను చేసిన ఘన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐది, ఈనెల 21న నల్గొండకు వచ్చి బస్సు జాతాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ




సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎలంక మహేష్, సిపిఐ సీనియర్ నాయకులు ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, వలిగొండ పట్టణ కార్యదర్శి సలిబద్రి రవీందర్, బాలగోని సత్యనారాయణ, నరిగే యాదయ్య, కట్ల యాదగిరి, బోడిగే సుదర్శన్, సుద్దాల సాయి కుమార్, మేడి దేవేందర్, మారోజు నరసింహ చారి, కోయగూరి రాములయ్య, సలిగంజి కృష్ణ కుమార్, పోషణ పోయిన బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కాసం వారి పెండ్లి పిలుపు

**నూతన వధూవరులను ఆశీర్వదించిన యాదాద్రి జిల్లా ఆర్యవైశ్య ప్రధాన కార్యదర్శి కాసం నాగేష్ దంపతులు.**

**యాదాద్రి,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** ఏఎన్ఆర్ గార్డెన్ ఆలేరులో కాసం మనోహర్, లత, గారెల కుమార్తె, అల్లుడు చండిక, దుర్గాప్రసాద్ గుప్తా గారుల వివాహానికి ముఖ్య అతిథిలుగా హాజరై ఆశీర్వదించిన యాదాద్రి జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కాసం నాగేష్ దంపతులు ముత్యాల పందిరిలో సూర్య చంద్రుల సాక్షిగా వేదమంత్రాలు చదవగా మూడు మూళ్ళ బంధంతో వెయ్యి జన్మల బందంగా వివాహ కల్యాణ ఈ వివాహ ఈ కార్యక్రమానికి సంతోష్- కృష్ణవేణి, సందీప్- కావ్య, శోభారాణి, సాత్విక, కాసం లక్ష్మీనారాయణ భాగ్యమ్మ, కాసం సత్తయ్య గీతారాణి, కాసం శీను, శ్రీకాంత్ దివ్య, సందీప్ నేహా, యాదగిరి శకుంతల, యాదయ్య సత్తయ్య, తదితరులు కుటుంబ సబ్యులు పాల్గొని ఆశీర్వదించినారు..



# బోరంపల్లి గ్రామంలో బహుజనుల జ్ఞాన జాతర-6 పోస్టర్ ఆవిష్కరణ

**మంచిర్యాల,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** గత 5 సంవత్సరాల నుంచి బోరంపల్లి గ్రామంలో బహుజనుల జ్ఞాన జాతరను జనవరి 1,2 , 3 రోజున జరుపుతున్నాం. రాబోయే బహుజనుల జ్ఞాన జాతర-6ను అదే విధంగా జరపబోతున్నాం. జనవరి-1వ రోజు విజయ దివాస్ ను పూలే దంపతుల పాఠశాలను ప్రారంభించిన రోజును అతిథులతో ఉత్సవంగా జరుపుకోవడం. జనవరి-2వ రోజు సంస్కృతిక కార్యక్రమాలు ఆటలు, పాటలు సినిమా చూపించడం. జనవరి-3వ రోజు సావిత్రి భాయి పూలే జయంతి ఉత్సవం జరపడం. ఈ బహుజనుల జ్ఞాన జాతర-6కు మన ప్రాంతంలో ఉన్న ప్రజలు అందరూ రావాలని నిర్వహణ కమిటీ ఆహ్వానం పలికి విజయవంతం చేయాలని కోరారు.ఈ బహుజనుల జ్ఞాన జాతరలో ముఖ్యమైనవి భీమా కోరేగాం స్థూపం(అక్కడ అమరవీరులకు సెల్యూట్ చేయడం), బుద్ధుడి ప్రతిమ, బుక్స్ ఎగ్జిబిషన్ ఫోటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి నిర్వహుకులు తెలిపారు.ఈ బహుజనుల జ్ఞాన జాతర-6 పోస్టర్ ఆవిష్కరణను మంచిర్యాల్ జిల్లా, కోటపల్లి మండలం, బోరంపల్లి గ్రామంలోని భీమా కోరేగాం స్థూపం ముందు చేయడం జరిగింది.



ఇందులో గ్రామ పెద్దలు, యువకులు పిల్లలు పాల్గొన్నారు. వారితో పాటు బహుజనుల జ్ఞాన జాతర-6 నిర్వహణ కమిటీ ఉన్నారు అందులో దుర్గం రాజమల్లు, గోమాస రాజసమ్ములు, దుర్గం ప్రదీప్, దుర్గం దయాకర్, దుర్గం శేఖర్, దుర్గం రవి, అంగడి రవి, ఉడుత రాజేష్, అంగడి వసంత్, దుర్గం రాజేష్, దుర్గం కృష్ణ దాస్, దుర్గం తిరుమలరాజు మరియు ఇతరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యలు గుర్తించేందుకే సిపిఎం గ్రామీణ కుటుంబ సర్వే

**- సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు**

**మోత్కూరు,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** గామాలల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యా, వైద్యం ఆర్థిక సామాజిక సమస్యలపై సిపిఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు గ్రామీణ కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు తెలిపారు.. అదివారం నాడు మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో జిల్లా కమిటీ పిలుపు భాగంగా రెండవ రోజుసిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో, ఇప్పటికీ రేషన్ కార్డులు, పెన్షన్లు, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు, విద్యా, వైద్యం, అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 నెలలుగా గ్రామాలలో పాలకవర్గాలు లేక పారిశుధ్యం, మంచినీరు, వీదిలైట్ల సమస్యలతో పాటు,పాలన అధికారులైన గ్రామ పంచాయితీ కార్యదర్శులకు ఒక్కరికి మూడు నాలుగు గ్రామాలు ఇంచార్జుల బాధ్యతలు ఉండటం వల్ల పాలన స్థంభించి గ్రామాలలో సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో, అభివృద్ధి కుంటుపడి, అనేక సమస్యలతో గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.. సిపిఎం గ్రామీణ కుటుంబ సర్వే ద్వారా గ్రామాలలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి అన్ని అంశాలపై పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పాలడుగు గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, మండల నాయకులు చింతకింది సోమరాజు, నిమ్మల సువర్ణ, వడ్డేపల్లి లక్ష్మణ్, చింతకింది లక్ష్మి, పసునూరి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY








# అట్టహాసంగా స్వరాభిషేకం స్వర్ణోత్సవం..

**మోత్కూరు, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** ప్రతి ఏడాది కూకట్‌పల్లి ప్రే కా.స స్టూడియోలో నిర్వహించే స్వరాభిషేకం స్వర్ణోత్సవం 2025 కార్యక్రమాన్ని ఆదివారం నాడు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రావ్య శృతి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, ప్రముఖ గాయకుడు సీనియర్ జర్నలిస్ట్ బి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ దాన గంధర్వ కంఠంతో శోత్రాలతో గాయకులు పాడిన పాటలు అక్కడికి వచ్చిన ప్రేక్షకులకు ఎంత ఉత్సాహాన్ని నింపాయని పేర్కొన్నారు. మానసిక ఉల్లాసానికి ఈ పాటలు ఎంతో దోహదపడతాయని అన్నారు ఈ సందర్భంగా స్వరాభిషేకం స్వర్ణోత్సవ 8వ, వార్షికోత్సవం పురస్కరించుకొని ఆ ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రావ్య శృతి గాయకులు,, ప్రేక్షకుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, గాయకుడు బి వెంకటేశ్వర్ల లతో అక్కడికి వచ్చిన వివిధ ప్రాంతాల గాయకులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంట్ లను అందజేసినట్లు సీనియర్ జర్నలిస్ట్ బి వెంకటేశ్వర్లు వార్తా వేదిక సూర్య మోత్కూరు ప్రతినిధితో మాట్లాడుతూ తెలిపారు.

# జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన ముత్తిరెడ్డిగూడెం క్రీడాకారులు

**గుర్రాల బన్నీ, అలకుంట్ల మనోజ్, మధాను ఆశిష్ జాయ్‌లు ఎంపిక**

**సోషల్ మీడియా వేదికగా పలువురు శుభాకాంక్షలు**

**డిసెంబరు 5 నుండి 7వ తేది వరకు మహారాష్ట్ర లో జరగనున్న జాతీయ స్థాయి త్రో బాల్ పోటీలు**



**మోటకొండూరు, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుర్రాల బన్నీ తండ్రి రామకృష్ణ, అలకుంట్ల మనోజ్ తండ్రి యాదగిరి, మధాను ఆశిష్ జాయ్ తండ్రి మదాను క్రీడాకారులు జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవలి నవంబర్ నెలలో హైదరాబాద్లోని మాదాపూర్‌లో సి జి ఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన జూనియర్ కేటగిరి అండర్ 19 త్రో బాల్ రాష్ట్ర స్థాయి ఎంపికలో వీరిని జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. గ్రామ స్థాయిని నుండి జాతీయ స్థాయికి వెళ్ళిన ముత్తి రెడ్డి గూడెం బిడ్డలను గ్రామస్థులు ,పెద్దలు, యువత అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు . డిసెంబరు 5 నుండి 7వ తేది వరకు మహారాష్ట్ర లో జరగనున్న జాతీయ స్థాయి త్రో బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

# రన్ ఫర్ సోషల్ జస్టిస్

**వలిగొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం మార్నింగ్ వాకర్స్ తో వలిగొండ న్యూ బస్టాండ్ నుండి హైస్కూల్ వరకు మార్నింగ్ వాక్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం




మండల అధ్యక్షులు సాయిని యాదగిరి మాట్లాడుతూ బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం టౌన్ అధ్యక్షులు నానచర్ల రమేష్, బీసీ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పబ్బు సురేందర్, కాసుల వెంకటేశం, పబ్బు వెంకటరమణ, బత్తిని బిక్షపతి, పబ్బు శివ, మారగోని బాలయ్య, కౌడి కృష్ణ మార్నింగ్ వాకర్స్‌లో పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** డిండి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మేకల కాశన్న - సాయమ్మ గార్ల కుమారుడు మేకల శివ - చందన గార్ల వివాహ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం డిండి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డు వి ఏ ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుక మహోత్సవ కార్యక్ర మంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అను బంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యాయ సాధన దీక్ష

**జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ**




**నల్లగొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, బీసీ జాక్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు కృష్ణన్న పిలుపుమేరకు, నల్లగొండ జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఎన్జీ కాలేజీ ఆవరణంలో న్యాయ సాధన దీక్ష ప్రారంభించా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, దీక్షలో పాల్గొని వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పూర్తి అధికారం ఇవ్వడం జరిగింది.

243b 6 ఆర్టికల్ ప్రకారం ఇవ్వడానికి స్వయం ప్రతిపత్తి కల్పించింది. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. ఇప్పటికైనా 42% రిజర్వేషన్ను చట్టం చేస్తూ ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు . విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే పార్లమెంట్లో బిల్లు పెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి నట్లయితే చట్టబద్రత ఉంటుంది. దాని బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందే 42% చట్టబద్ధత కల్పించిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని

ఈ సందర్భంగా వారు కోరారు. బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుండు వెంకటేశ్వర్లు, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ విజయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బక్కతట్ల వెంకన్న యాదవ్, జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె నాగరాజు, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెబోయిన సతీష్ యాదవ్, అఖిలభారత యాదవ సంఘం జిల్లా కార్యదర్శి సుంకరబోయిన శివకుమార్ యాదవ్, విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరి బాబు, కుకుడాల ఏడుకొండలు, సట్టు యాదగిరి, వీరమల్లు నాగరాజు గౌడ్, డబ్బికారు రాజు, చల్మకా చారి, రజక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం శంకరయ్య, పగిళ్ల సైదులు, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు కర్నాటి ధనుంజయ, మేడబోయిన సాయి, వినోద్, మచ్చ నాగరాజు యాదవ్,కొగ్గరి శ్రీనివాస్, కర్నాటి మచ్చ గిరి, బీసీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు 30% రిజర్వేషన్ కల్పించాలి



**మోత్కూరు,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** రానున్న స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు 30% రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షులు ఎర్రవెల్లి నాగేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నాడు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు వికలాంగులను చిన్నచూపు చూస్తున్నారని తాము రాజకీయాలలో రాణించాలనుకుంటున్నామని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ఎన్నికలతోపాటు అసెంబ్లీ పార్లమెంట్ అనే ఎన్నికలలో కూడా తమకు ప్రాతినిత్యం కల్పించాలని నాగేశ్వర్ డిమాండ్ చేశారు. వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలని గత రెండు దశాబ్దాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ తమ పరిగణంలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు వికలాంగులకు రాజకీయాలలో రాణించడానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

# నేటి నుంచి పత్తి సీసీఐ కేంద్రాల బంద్

**మోత్కూరు,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** తెలంగాణ కాటన్ జిన్నింగ్ మిల్లు ల తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ 17 నుండి బంద్ పాటిస్తున్న నేపథ్యంలో మోత్కూరు మండల పరిధిలో ఉన్న సిసి కేంద్రాల్లోకి పత్తిని తీసుకురావద్దని ఆయా మిల్లు యాజమానులు కోరుతున్నారు. పత్తి రైతులు యాప్ లో 17 నుంచి పత్తి అమ్మకాల కోసం ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులు ఆ బుకింగ్ ను రద్దు చేసుకోవాలని, సీసీఐ కేంద్రాలలోకి పత్తిని తీసుకురావద్దన్నారు.

# లీగల్ సర్వీసెస్ సేవలు ప్రజలు వినియోగించుకోవాలి

**వలిగొండ,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** వలిగొండ మండలంలోని నాగారం గ్రామ పంచాయితీ అవరణలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా లీగల్ సెల్ సభ్యులు




బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం లు కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమం నందు ప్రజలకి సివిల్, క్రిమినల్, విద్య వైద్య, బాల బాలికలు, వృద్ధులు, భూతగాదాలు, బాలికల చట్టాలు, బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ, మహిళల రక్షణ, సంరక్షణ, మానవ హక్కుల లింగ వివక్ష వంటి ఉండకుండా అన్నింటిపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్న లీగల్ సర్వీసెస్ సేవలు వినియోగించుకావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**విలేకరులు కావలెను:**

వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

**యాదాద్రి భువనగిరి:** యాదగిరిగుట్ట, యాదగిరిగుట్ట టౌన్, యాదగిరిగుట్ట రూరల్, బొమ్మలరామారం, గుండాల, అడ్డగూడూరు, ఆలేరు, భువనగిరి, భువనగిరి రూరల్, బీబీనగర్, తిరుమలగిరి, స్వర్ణగిరి దేవాలయం, రాజాపేట మండలాల విలేకర్లు కావలెను.

**నల్లగొండ :** చిట్యాల, నార్కట్‌పల్లి, కనగల్, తిప్పర్తి, మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, మాల్, మర్రిగూడెం, చింతపల్లి, గుర్రంపోడు, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్, కట్టంగూర్, హుజూర్‌నగర్, మఠంపల్లి, త్రిపురారం, చందంపేట, దిండి మండలాలలో రిపోర్టర్స్ కావలెను.

**అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును**

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

పోలోజు శ్రీనివాసాచారి
ఛైర్మన్ & ఎడిటర్.
9985389183



**దేవరకొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** బిఆర్ఎస్ పార్టీ నాంపల్లి మాజి ఎంపిపి ఎదుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి గారి హైదరాబాద్లోని హస్తినాపురం ద్వారక నగర్ లోగల నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్

## వివాహా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జాలే నరసింహారెడ్డి

**దేవరకొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** నేడు చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామానికీ చెందిన శ్రీమతి శ్రీ ఎరుకలి రేవతమ్మ క్రీ.శే. వెంకటయ్య గార్ల కుమార్తె (సుష్మా శివ)ల కొండమల్లేపల్లి పట్టణంలోని హైదారాబాద్ రోడ్డు లో కెఎంఆర్ గార్డెన్ లో జరిగిన వివాహా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన



వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పీసీసి సభ్యులు & పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, బందేల తిరుపతయ్య, శరత్, మరియు తదితరులు పాల్గొన్నారు

## రామావత్ సుజాత గౌతమి గార్లను పరామర్శించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** డిండి మండలంలోని జేత్య తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రామావత్ సుజాత, గౌతమి గార్లు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై యన్నమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని నేడు కల్వకుర్తి యన్నమ్స్ ఆసుపత్రికి చేరుకొని బాధిత



క్షతగాత్రులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని,మెరుగైన వైద్య అందించాలని వైద్య అధికారులను కోరిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.. వారితో పాటు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, జేత్య నాయక్ తండా మాజీ సర్పంచ్ రమావత్ కేళి కిషన్ నాయక్ పాల్గొన్నారు.

## నీలగిరి ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ధ్వజారోహణ మండల పూజ..

**నల్లగొండ,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
స్థానిక ఎస్ ఎల్ బీసీ లోని నీలగిరి ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం ధ్వజారోహణ మండల పూజ ప్రారంభం కన్నుల పండుగ జరిగింది.





వందలాది మంది స్వాములు పాల్గొని అయ్యప్ప పూజలు నిర్వహించారు అనంతరం స్వాములకు భక్తులకు అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బీరవెల్లి గోపాల్ రెడ్డి బాలయ్య అర్చకులు పెన్నా సుబ్రహ్మణ్య శాస్త్రి, మాజీ కౌన్సిలర్ చిన్నాల అలివేలు జానయ్య, కందికొండ శ్రీనివాస్, ఆమనగంటి బిక్షా రెడ్డి,కంజర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**దేవరకొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** కొండమల్లేపల్లి పట్టణం దుర్గా నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దుర్గామాత దేవాలయంలో ఈరోజు అనగా ఆదివారం దేవాలయంలో గండూరి జయమ్మ కుమారుడు గండూరి మహేష్. శ్రావణి గార్లు హనుమాన్, దుర్గామాత, శివ దీక్ష స్వాములందరికీ అన్న ప్రసాద వితరణ (అన్నదానం) కార్యక్రమం నిర్వహించారు.





# యూ/18 ఖో ఖో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** కోరుట్ల కాలేజ్ గ్రౌండ్లో నిర్వహించిన ఈ ఆర్ ఎస్ టి వైల్ కరీంనగర్ యూ/18 ఖో ఖో టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు..

ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కావని ఎ అవి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, శారీరక-మానసిక దృఢతకు పునాది అన్నారు.. టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు, ఓర్పు, పట్టుదల వంటి విలువలు క్రీడల ద్వారానే నేర్చుకుంటారని తెలిపారు..

ఖో ఖో వంటి భారతీయ క్రీడలకు యువతలో పెరుగుతున్న ఆదరణ ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు..

ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి తనవంతు ప్రోత్సాహం, అవసరమైన సదుపాయాలు అందిస్తానని హామీ ఇచ్చారు.తమ ప్రతిభను చూపించడానికి వచ్చి పోటీ పడ్డ ఆటగాళ్లను అభినందిస్తూ, ఎంపికలలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కోరుట్ల స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

# కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి - పుస్తక ఆవిష్కరణ సభను జయప్రదం చేయండి

### సీపీ రెడ్డి సభ - పోస్టర్ ఆవిష్కరణ

**నల్లగొండ,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
భారత విప్లవోద్యమ నిర్మాత, ప్రతిఘటన పోరాట రూపకర్త కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతి సందర్భంగా సీపీ రెడ్డి రాసిన కొన్ని ముఖ్యమైన రచనలను పుస్తకంగా ముద్రించి, నవంబర్ 19 న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్ లో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో సీపీ రెడ్డి 41వ వర్ధంతి -పుస్తకం (తెలుసు-ఇంగ్లిష్) ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నదని, ఈసభ కు సీపీ రెడ్డి అభిమానులు, విప్లవ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి అంబటిచిరంజీవి పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం సీపీ రెడ్డి సభ పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ..చంద్ర పుల్లారెడ్డి భారత స్వాతంత్రోద్యమ కాలంలో వలస రాజ్య పాలనకు వ్యతిరేకంగా విద్యార్థులను పోరాటాలవైపు కదిలించాడని అన్నారు. దేశం సంపూర్ణ స్వతంత్ర్యం సాదించాలంటే స్వాతంత్రోద్యమానికి కమ్యూనిస్ట్ పార్టీ నేతృత్వం వహించాలని భావించి ఉన్నత చదువును వదులుకొని ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడని అన్నారు. 1952లో నందికొట్కూరు శాసనసభ్యులు గా ఎన్నికై అనేక అనేక పోరాటాలు నిర్మించాడని పార్టీ పిలుపుమేరకు పదవికి రాజీనామా చేసి భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడని అన్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలు అనుసరించిన మితవాద రివిజనిస్ట్ సిద్ధాంతాన్ని ఎండగట్టి విప్లవకారులు భారత విప్లవోద్యమ నిర్మానానికి పూనుకున్నారని అన్నారు.



నగ్జల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రతిఘటన పోరాటాలను నిర్మించాడని కొనియాడారు. భారత దేశంలో నూతన ప్రజాస్వామిక విజయవంతం చేయడానికి, పురోగమింప చేయడానికి చంద్ర పుల్లారెడ్డి తన జీవితకాలామంత పనిచేశాడని అన్నారు. సీపీ రెడ్డి ద్వారా విప్లవ సైద్ధాంతిక అవగాహనను, ఆయన సహసోపేతమైన ఆచరణను మనం నేర్చుకోవాలని అన్నారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా ఆయన రాసిన ముఖ్యమైన రచనలను సీపీఐ (యం- యల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ తెలుగు, ఇంగ్లిష్ అనువాదాలతో పుస్తకాలు తీసుకొస్తుందని, ఈ పుస్తక ఆవిష్కరణ సభను ఈనెల 19న హైదరాబాద్ లోని సుదరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహించడం జరుగుతుందని విప్లవ శ్రేణులు, సీపీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అఖిల భారత రైతు-కూలీ సంఘం జిల్లా కోశాధికారి గజ్జి రవి, పి. వై.ఎల్ జిల్లా అధ్యక్షులు మామిడోజూ వెంకటేశ్వర్లు, అఖిల భారత రైతు-కూలీ సంఘం నాయకులు పుట్ట సత్యం, ఐ యఫ్ టీ యూ నాయకులు మామిడి ఎల్లయ్య,బి.యం.ఎస్ కన్వీనర్ చెడిపల్లి కాశీరాం, బీసీపీ జిల్లా నాయకులు బొల్లికొండ లింగయ్య, వెంకటరెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవం

**నల్లగొండ,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్ ఈ లైబ్రరీ తెలంగాణ ఫౌండర్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రంథాలయ సమాచార శాస్త్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్, హాజరై మాట్లాడుతూ.. పాఠకులకు ఇంటర్నెట్ యొక్క వినియోగం ,సమాచారం వనరులు వెతకడం వినియోగించుకోవడం , ఇన్ఫర్మేషన్ ఫార్మేట్స్, ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్ ఈ-బుక్స్ ఈ-జర్నల్స్, ఈ-మేగజైన్స్ ఈ-డేటాబేసేస్ ఎలక్ట్రానిక్ న్యూస్ పేపర్స్ ఎలక్ట్రానిక్ పేటెంట్స్ ఇంటర్నెట్ ద్వారా పోటీ పరీక్షలకు, ఉన్నత విద్య, పరిశోధనలకే ప్రత్యేక సమాచారం, నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా, స్వయం ఎంప్లాయిమెంట్ న్యూస్, ఈరోజు కోటి పరీక్షలలో ఎలక్ట్రానిక్ వీడియో ఉపన్యాసాలు , మొబైల్





అప్లికేషన్లో ఎంతగానో అందుబాటులో ఉన్నాయని, డిజిటల్ లైబ్రరీ పై గ్రంథాలయ పాఠకులకు అవగాహన ప్రత్యేక ప్రసంగం ద్వారా తెలియజేయడం జరిగింది. ఆదివారం ప్రమీల ఉపాధ్యాయురాలు పాఠకులకు యోగ పై శిక్షణ ఇచ్చి, గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ చేయడం జరిగింది అని జిల్లా గ్రంథాలయ సెక్రెటరీ బాలమ్మ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, గాధ వినోద్ రెడ్డి, నల్గొండ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, ప్రమీల ఉపాధ్యాయురాలు, జిల్లా గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొని ఈ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేశారు.

# బస్వాపురం ప్రాజెక్ట్‌లో ముంపుకు గురవుతున్న లప్ప నాయక్ తండా ప్రజలకు ప్లాట్స్ పంపిణీ చేయాలి

### కల్లూరి మల్లేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

**యాదగిరిగుట్ట రూరల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
బస్వాపురం ప్రాజెక్టు పరిధిలో ముంపుకు గురవుతున్న లప్ప నాయక్ తండ ప్రజలకు రెండు సంవత్సరాల క్రితం కేటాయించిన ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణం కోసం అయ్యే ఖర్చుకు ప్రభుత్వం సహకారం అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిపిఎం కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా ఆదివారం రోజున లప్ప నాయక్ తండ గ్రామంలో ఇంటింటికి సర్వే నిర్వహించడం జరిగింది.ఈ సర్వేలో పాల్గొన్న కల్లూరి మల్లేశం మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టు నిర్మాణానికి గ్రామంలో ఉన్న 750 ఎకరాల భూమిని మరియు నివాస ప్రాంతాలను పూర్తిగా ప్రజలు ఇచ్చారని కానీ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాట మీద లేదని గత రెండు సంవత్సరాల క్రితం ఇంటి స్థలాల కోసం ప్లాట్స్ చేసి నేటికీ పంపిణీ చేయలేదని విమర్శించారు. ఇంటి స్థలాలు పంపిణీ చేయక పోవడంతో ప్రభుత్వ మిచ్చిన డబ్బులు ఇప్పటికే ఖర్చు చేశారని సకాలంలో ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇస్తే ఈపాటికి నిర్మాణం అయ్యేదని తెలియజేశారు.

నేటికీ గ్రామంలో 60 ఎకరాలకు నష్టపరిహారం పైసా అందలేదని ఇంకో 60 మందికి 18 సంవత్సరాలు నిండిన వారికి





ప్యాకేజీ పెండింగ్‌లో ఉన్నదని,ఆరు కుటుంబాలకు ఏ విధమైన ప్యాకేజీ అందలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.నేటికి నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల ముందు లప్ప నాయక్ తండా ప్రజలకు ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మరియు ప్రభుత్వ విప్ ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సర్వేలో నరేష్ నాయక్,నవీన్ నాయక్, ప్రవీణ్ నాయక్, అభిలాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
హైదరాబాదులోని వనస్థలిపురంలోని ఎంఈ రెడ్డి గార్డెన్లో జరిగిన చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పరదం శేఖర్ మేనల్లుడు వివాహ మహోత్సవ కార్యక్రమంలోఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలోని రిక్కల సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగిన నారాయణపురం మండలం జనగాం ఆరెగూడెం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు వంగూరి శంకర్ వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

## నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి సభ్యులు డాక్టర్ దుదిపాల వేణుధర్ రెడ్డి

**దేవరకొండ, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
కొండమల్లేపల్లీ మండల పరిధిలో చింతకుంట్ల గ్రామానికి చెందిన కాలాగోని చంద్రయ్య కుమారుడు శివ & సుష్మ గార్ల వివాహ మహోత్సవ వేడుకల్లో



భాగంగా ఈ రోజు కొండమల్లెపల్లి లో హైదరాబాద్ రోడ్డులో గల. కె.ఎం.ఆర్ ఫంక్షన్ హల్ లో జరిగిన వివాహ వేడుక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి వారితో మాజీ సర్పంచ్ వెంకటయ్య బచ్చనమోని ఇద్దయ్య, పిల్లి వెంకటయ్య, కాలాగోని లక్షమయ్య,శవ్వ మదర్, అంజి,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## లక్కారం పెద్ద చెరువులో చేప పిల్లలు విడుదల చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక



అభివృద్ధి కోసం నాణ్యతమైన చేప పిల్లలను 100% సబ్సిడీ చేప పిల్లలను పంపిణీ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ఆకుల ఇంద్రసేనారెడ్డి గారు మరియు మత్స్య కార్మిక సొసైటీ సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





# అయ్యప్ప స్వాములకు అన్నదానం ప్రారంభించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని ఆదివారం మును



గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు సహ కారంతో చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ



సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద నైవేద్యాన్ని దేవుడికి సమర్పించారు.
దేవాలయంలో అన్న ప్రసాద వితరణ దాతలుగా చెవ్వగొని వెంకటేష్ గౌడ్ దంపతులు వారి కుమార్తె భవ్య శ్రీ పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద్ వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, బొబ్బిళ్ళ మురళి గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షులు, దేవాలయ కమిటీ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ స్వామి ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నరసింహ గౌడ్, మోగుదాల రమేష్ గౌడ్, కంచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి, చింతల సాయిలు, అంతటి రాము గౌడ్, వెలగా రాజశేఖర్ రెడ్డి గుండు మల్లయ్య గౌడ్, తిరుపతి రవీందర్, బాబా షరీఫ్, ఎస్కే జానిబాబు, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, పెద్ద గోనీ రమేష్ గౌడ్, చెనగోనిఅంజయ్య గౌడ్, బత్తుల శ్రీశైలం గౌడ్ మంచి కంటి భాస్కర్, సోమవరపు సత్తయ్య, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గుజ్జుల రవీందర్ రెడ్డి బోడిగే బాలకృష్ణ గౌడ్, పస్తం గంగా రాములు గుర్రం వెంకటేశం, తూర్పాటి శంకర్ గురుస్వామి, సుక్క సుదర్శన్ స్వామి, గుత్తికొండ సుధీర్, మోపర్తి దేగేశ్వరరావు, కిలారి వెంకటరమణ, దేవాలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి గారు అయ్యప్ప దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ గాయత్రీ మహా యజ్ఞం

**నల్లగొండ,నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
పట్టణంలోని తులసీ నగర్ పట్టణంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆది వారం హనుమత్ గాయత్రి మహా యజ్ఞం ఘనంగా నిర్వహించారు స్వామివారి పూజ ఉత్సవ అనుజ్ఞ విఘ్నేశ్వర పూజ శైవ శుద్ధి మహా పుణ్యాహవాచనం మంటపార్చన మహాలక్ష్మి పూజ పంచామృత అభిషేకములు విశేషాలంకరణ అష్టోత్తర నాగవెల్లి దళార్చన అగ్ని ప్రతిష్టాపన గణపతి నవగ్రహ మాన్యుసూక్త హెూమములు అనంతరం హనుమత్ గాయత్రీ మహా యజ్ఞం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు అనంతరం పూర్ణాహుతి నీరాజనం మంత్రపుష్పములు తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కళాసిక కుశలయ్య అర్చకులు పోతులపాటి శివప్రసాద్ శర్మ గంగాపురం హరీష్ శర్మ వంగిపురం హనుమంత ఆచార్యులు ఆలయ సిబ్బంది శేఖర్ గోదాదేవి శీను గురుస్వాములు ప్రభాకర్ రెడ్డి కత్తుల జగన్



పూజిత శీను బద్రు నాయక్ జగన్ కృష్ణ బిక్షం విష్ణు నరేష్ శ్రీనివాస్



తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ అధ్యక్షులుగా ఎరుకల రాందాస్ గౌడ్ ఎన్నిక

**చౌటుప్పల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులిగా ఎరుకల రాం దాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శిగా దోర్నాల నరేష్ నేతను గ్రామ పెద్దలు శాశ్వత సభ్యత్వ సభ్యులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎరుకల రాందాస్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని నా ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలకు, దేవాలయ శాశ్వత సభ్యత్వ సభ్యులకు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు కొండూరు నరసింహ శర్మ, తాజా మాజీ సర్పంచ్ బక్క స్వప్న శ్రీనాథ్, దేవాలయ మాజీ కమిటీ అధ్యక్షులు దోర్నాల సోమలింగం మాజీ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యమూర్తి, దేవరకొండ కనకచారి, దోర్నాల శ్రీనివాస్, మాజీ వార్డ్ మెంబర్లు బోయిని నరసింహ యాదవ్, బండ్ల శ్రీకాంత్ యాదవ్, బండ్ల మధు యాదవ్, దోర్నాల బిక్షపతి,ముత్యం



ప్రకాష్, దోర్నాల భాస్కర్,బాతరాజు సైదులు, చెరుకు రమేష్ గౌడ్, ఎరుకల స్వామి గౌడ్, చెరుకు నరేష్ గౌడ్, బక్క నరేష్, చెక్క



శివకుమార్, చీమ కండ్ల మధు, మరియు గ్రామ పెద్దలు,ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



## బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్‌కు సన్మానం చేసిన దేవాలయ కమిటీ సభ్యులు

**చౌటుప్పల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
చౌటుప్పల్ మున్సిపాలిటీలోని వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వాములు మరియు,భక్తుల సౌకర్యార్థం చౌటుప్పల్ పట్టణ కాంగ్రెస్ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ తన సొంత నిధులతో వేయించిన బోరు వేయించారు అలాగే దేవాలయం ముందు షెడ్డుకు విరాళంగా ధనరూపేన సహకారం అందించినందుకు దేవాలయ కమిటీ సభ్యులచే ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు అనంతరం దేవాలయ అధ్యక్షులు నాగిల రామచంద్రం ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి. కోశాధికారి ఎలుక రాజు నాగరాజు, ఉపాధ్యక్షులు. ఉష్కా గుల శ్రీనివాస్ గౌడ్. తోర్పునూరి నరసింహ గౌడ్ గట్టు పవన్



నక్కెరగంటి శ్రీశైలం. చెవగోని మహేష్ గౌడ్. ఉదరి యాదయ్య, జక్కర్తి శేఖర్, ఉదరి మారయ్య, దేవాలయ గౌరవ సలహాదారులు బత్తుల శ్రీశైలం గౌడ్. సలహాదారులు అన్నమోని గోవిందరాజు.. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ. పి. సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



## మత్స్య కార్మికుల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది

**- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, నవంబర్ 16(వార్త వేదిక సూర్య):**
మత్స్య కార్మికుల కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం పెద్ద చెరువు లో చేప పిల్లలను విడుదల చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం నాణ్యతమైన చేప పిల్లలను 100% సబ్సిడీ చేప పిల్లలను పంపిణీ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునుగోడు ఎన్నికలు ఇంచార్జ్ పప్పు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి మరియు మత్స్య కార్మిక సొసైటీ సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో భారత్ అనూహ్య ఓటమి!

### తొలి టెస్టులో భారత్‌కు అనూహ్య ఓటమి
### దక్షిణాఫ్రికా సంచలన విజయం
### సఫారీ స్పిన్ తంత్రంలో చిత్తయిన టీమ్ఇండియా
### సైమన్ ధాటికి విలవిల

**కోల్‌కతా:** స్వదేశంలో బెబ్బులిలా గర్జించే భారత జట్టుకు కొట్టిన పిండి అయిన ఈడెన్ గార్డెన్స్‌లో ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) డిఫెండింగ్ చాంపియన్ అయిన దక్షిణాఫ్రికాతో మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో టీమ్ఇండియా 30 పరుగుల తేడాతో అవమానకర ఓటమిని మూటగట్టుకుంది. పర్యాటక జట్టు నిర్దేశించిన 124 పరుగుల స్వల్ప ఛేదనలో మెన్ ఇన్ బ్లూ.. 35 ఓవర్లలో 93 పరుగులకే చేతులెత్తేసి ఘోర పరాభవం



వైపు నిలిచారు. సఫారీల తురుపుముక్క, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సైమన్ హార్మర్ (4/21) ఆఫ్ స్పిన్ మాయాజాలానికి తోడు కేశవ్ మహారాజ్ (2/37), పేసర్ మార్కో యాన్సెన్ (2/15) ధాటికి భారత బ్యాటర్లు క్రీజులో నిలిచేందుకు నానా తంటాలు పడ్డారు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా.. కెప్టెన్ టెంబా బవుమా (136 బంతుల్లో 55 నాటౌట్, 4 ఫోర్లు) అజేయ అర్ధ శతకంతో ఆ జట్టుకు పోరాడే స్కోరును అందించాడు.

#### సమిష్టి వైఫల్యం

లక్ష్యం పెద్దదేమీ కాకున్నా స్పిన్నర్లకు అనుకూలించిన పిచ్‌పై 124 రన్స్ ఛేదించడమూ టీమ్ఇండియాకు శక్తికి మించిన పనే అయింది. తొలి ఓవర్ నుంచే మొదలైన వికెట్ల పతనానికి ఎక్కడా అడ్డుకట్ట పడలేదు. మొదట్లో పేసర్ యాన్సెన్ పేస్ పదునుకు ఓపెనర్లిద్దరూ దారుణంగా విఫలమైతే హార్మర్ మిడిలార్డర్‌ను ఆటాడించాడు. వాషింగ్టన్ సుందర్ (92 బంతుల్లో 31, 2 ఫోర్లు) మినహా మిగిలినవారెవరూ నిలకడగా కనీసం 35 బంతులపాటు క్రీజులో నిలువలేకపోయారు. యాన్సెన్ వేసిన మొదటి ఓవర్లోనే జైస్వాల్.. కీపర్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. మూడో ఓవర్లో అతడు రాహుల్‌నూ అదే రీతిలో పెవిలియన్‌కు పంపడంతో భారత జట్టు 10/2తో భోజన విరామానికి వెళ్లింది.

లంచ్ తర్వాత జురెల్ (34 బంతుల్లో 13), వాషింగ్టన్ 12 ఓవర్ల పాటు క్రీజులో నిలబడ్డా స్కోరుబోర్డు మాత్రం నెమ్మదిగానే కదిలింది. లంచ్ అనంతరం తన ఐదో ఓవర్లో హార్మర్.. జురెల్‌ను ఔట్ చేసి 32 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఇక ఆ తర్వాత వచ్చినోళ్లు వచ్చినట్టు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గిల్ గైర్హాజరీలో స్టాండ్ ఇన్ కెప్టెన్ రిషభ్ పంత్ (2).. హార్మర్ బౌలింగ్‌లో అతడికే క్యాచ్ ఇచ్చాడు. ఆదుకుంటాడనుకున్న జడేజా (18) కూడా హార్మర్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. క్రీజులో ఒంటరిపోరాటం చేసిన వాషింగ్టన్‌ను పార్ట్ టైమ్ స్పిన్నర్ మార్క్‌రమ్ బోల్తా కొట్టించడంతో భారత ఓటమి దాదాపుగా ఖరారైంది.

#### ఖేల్ ఖతం

భారత స్కోరు 77/7తో ఉన్న దశలో అక్షర్ పటేల్ (26) క్రీజులో ఉండటంతో భారత అభిమానులు ధీమాగానే ఉన్నారు. అందుకు తగ్గట్టుగానే అతడు.. మహారాజ్ వేసిన 35వ ఓవర్లో 4, 6, 6 బాదాడు. కానీ అదే ఓవర్లో ఐదో బంతికి బవుమాకు క్యాచ్ ఇవ్వడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఆరో బంతికి



మహారాజ్.. సిరాజ్‌నూ ఔట్ చేసి 15 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికాకు భారత్‌లో తొలి టెస్టు విజయాన్ని ఖాయం చేశాడు.

#### బవుమా పోరాటం

ఓవర్ నైట్ స్కోరు 93/7తో మూడో రోజు క్రీజులోకి వచ్చిన సౌతాఫ్రికాను బవుమా ఆదుకున్నాడు. పట్టుదలగా బ్యాటింగ్ చేసిన అతడికి బాష్ (25) మంచి సహకారం అందించాడు. ఈ జోడీ 8వ వికెట్‌కు 44 రన్స్‌ను జోడించి ఆ జట్టు ఆధిక్యాన్ని వంద పరుగులు దాటించింది. ఈ భాగస్వామ్యమే భారత్‌ను దెబ్బతీసింది. బుమ్రా ఎట్టకేలకు బాష్‌ను బౌల్డ్ చేశాడు. అతడే వేసిన ఓవర్లో బౌండరీతో బవుమా హాఫ్ సెంచరీ పూర్తైంది. సిరాజ్ ఒకే ఓవర్లో హార్మర్ (18), మహారాజ్‌ను ఔట్ చేసి సఫారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

**సంక్షిప్త స్కోర్లు:** దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159 ఆలౌట్‌బీ భారత్ తొలి ఇన్నింగ్స్: 189 ఆలౌట్

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 153 ఆలౌట్ (బవుమా 55లి, బాష్ 25, జడేజా 4/50, సిరాజ్ 2/2)

భారత్ రెండో ఇన్నింగ్స్: 35 ఓవర్లలో 93 ఆలౌట్ (వాషింగ్టన్ 31, అక్షర్ 26, హార్మర్ 4/21, యాన్సెన్ 2/15)

# కాస్ట్లీ మిస్టేక్..!

ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ లో భారీ మార్పులు చేర్పులు చోటు చేట్కసుకున్నాయి. రాజస్థాన్ రాయల్స్ తో చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ల మార్పిడి ఒప్పందం ఖరారైంది. ఈ డీల్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ సీఎస్కే లోకి వెళ్లగా.. రవీంద్ర జడేజా, సామ్ కరన్.. రాజస్థాన్ రాయల్స్‌లో చేరనున్నారు. దీనికి సంబంధించిన డీల్ అధికారికంగా పూర్తయింది. రవీంద్ర జడేజాను రిలీజ్ చేసినట్లు





తెలిపింది. ఈ మేరకు చెన్నై సూపర్ కింగ్స్ ఓ వీడియోను విడుదల చేసింది. నేడు ఐపీఎల్ రిటెన్షన్స్ కు తుది గడువు. ఈ పరిస్థితుల మధ్య రవీంద్ర జడేజా, సామ్ కరన్, సంజు శాంసన్ మార్పిడి ప్రక్రియ పూర్తయింది. రిటెన్షన్స్ తర్వాత ఈ ఒప్పందాన్ని రెండు జట్ల ఫ్రాంఛైజీలు అధికారికంగా ప్రకటించనున్నాయి. 2026 సీజన్ తర్వాత మహేంద్రసింగ్ ధోని ఐపీఎల్ కు గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఇప్పటినుంచే అతని వారసుడిగా సంజు శాంసన్ ను తీసుకోవడం, జట్టును పునర్నిర్మించే ప్రయత్నాల్లో భాగంగా ఈ డీల్ జరిగింది. రవీంద్ర జడేజాను 14 కోట్ల రూపాయలకు జట్టులోకి తీసుకుంది రాజస్థాన్ రాయల్స్.

ఐపీఎల్‌లో నిలకడగా సత్తా చాటుతోన్న ప్లేయర్లల్లో ఒకడు.. సంజు శాంసన్. అటు టీమిండియా తరఫున టీ20 ఇంటర్నే షనల్స్ లోనూ అదరగొడుతున్నాడు. ఈ ఫార్మట్ లో ఇప్పటివరకు మూడు సెంచరీలు బాదాడు. ఈ రికార్డు అతి కొద్దిమందికి మాత్రమే ఉంది. దశాబ్దానికి పైగా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిథ్యాన్ని వహిస్తోన్నాడీ మలయాళీ క్రికెటర్. 2013లో రాజస్థాన్ రాయల్స్ తో టై అప్ అయ్యాడు. అప్పటి నుంచీ అదే జట్టులో కొనసాగుతున్నాడు. 2018లో అతన్ని రిలీజ్ చేసినప్పటికీ.. మళ్లీ అదే ఫ్రాంఛైజీ అతన్ని రిటైన్ చేసుకుంది. 18 కోట్ల రూపాయలతో కాంట్రాక్ట్ పొడిగించు కుంది. సుదీర్ఘకాలంగా జట్టు కేప్టెన్ గా వ్యవహరిస్తోన్నాడు. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ కు గుడ్ బై చెప్పాలని సంజు శాంసన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

ఐపీఎల్ లో నిలకడగా సత్తా చాటుతోన్న ప్లేయర్లల్లో ఒకడు.. సంజు శాంసన్. అటు టీమిండియా తరఫున టీ20 ఇంటర్నేషనల్స్ లోనూ అదరగొడుతున్నాడు. ఈ ఫార్మట్ లో ఇప్పటివరకు మూడు సెంచరీలు బాదాడు. ఈ రికార్డు అతి కొద్దిమందికి మాత్రమే ఉంది. దశాబ్దానికి పైగా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిథ్యాన్ని వహిస్తోన్నాడీ మలయాళీ క్రికెటర్. 2013లో రాజస్థాన్ రాయల్స్ తో టై అప్ అయ్యాడు. అప్పటి నుంచీ అదే జట్టులో కొనసాగుతున్నాడు. 2018లో అతన్ని రిలీజ్ చేసినప్పటికీ.. మళ్లీ అదే ఫ్రాంఛైజీ అతన్ని రిటైన్ చేసుకుంది. 18 కోట్ల రూపాయలతో కాంట్రాక్ట్ పొడిగించు కుంది. సుదీర్ఘకాలంగా జట్టు కేప్టెన్‌గా వ్యవహరిస్తోన్నాడు. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్‌కు గుడ్ బై చెప్పాలని సంజు శాంసన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడనున్నాడు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా. 12 సీజన్ల పాటు అతను చెన్నై సూపర్ కింగ్స్ కు ప్రాతినిథ్యాన్ని వహించాడు. ప్రస్తుతం జడేజా లీగ్ ఫీజు 18 కోట్ల రూపాయలు. కాగా దీన్ని 14 కోట్ల రూపాయలకు తగ్గించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అతని రాకతో రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండ్ విభాగం బలోపేతం అవుతుందని ఆశిస్తున్నారు. జడేజాతో పాటు సామ్ కరన్ కూడా ఆర్ఆర్ కు వచ్చాడు. అతని లీగ్ ఫీజు 2.4 కోట్ల రూపాయలు.

### ఆస్పత్రి నుంచి గిల్ డిశ్చార్జ్ ..
# రెండో టెస్టు ఆడేనా.!

తొలి టెస్టులో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడిన భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కోలుకుంటున్నాడు. మెడకు బంతి తాకడంతో శనివారం ఆస్పత్రిలో చేరిన గిల్.. ఆదివారం డిశ్చార్జ్ అయ్యాడు. హాస్పిటల్ నుంచి నేరుగా టీమ్ హెూటల్ చేరుకున్నాడు టీమిండియా సారథి. అయితే.. అతడికి వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి సూచించారు. దాంతో.. సిరీస్‌లో కీలకమైన రెండో టెస్టుకు గిల్ అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.







### టోక్యో డెఫ్లింపిక్స్ 2025లో పసిడి..
# శ్రీకాంత్‌కు భారీ నజరానా

టోక్యో డెఫ్లింపిక్స్ 2025లో గోల్డ్ మెడల్ సాధించిన ధనుష్ శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ స్పోర్ట్ పాలసీలో భాగంగా షూటర్ ధనుష్‌కు ప్రభుత్వం తరుపున 1కోటి 20 లక్షల రూపాయల ప్రోత్సాహం అందచేస్తామని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రు స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్ నూతన స్కూల్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. క్రీడల్లో క్రమశిక్షణ చాలా అవసరమని, ఏకాగ్రత ఉంటేనే క్రీడల్లో రాణించగలమని విద్యార్థులు ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు.

విద్యార్థి దశలోనే క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కన్నా చిన్న దేశమైన సౌత్ కొరియా ఒలంపిక్స్ లో 36 స్వర్ణ పథకాలు గెలిచిందని, కానీ మనం ఒలంపిక్స్ లో ఎందుకు పథకాలు గెలవలేక పోతున్నామో విద్యార్థులు ఆలోచించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం స్పోర్ట్ హబ్ ఆఫ్ ఇండియాగా ఎదగడమే స్పోర్ట్ పాలసీ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోరట్స్ యూనివర్సిటీని స్థాపిస్తుందని ఈ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోరట్స్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో విద్యను అందించడం జరుగుతుందని తెలియజేశారు.

ఇప్పటికే కోచ్ కోసం గురు వందనం పథకం కింద తెలంగాణ క్రీడా శాఖ కోచ్ల కోసం మొదటిసారిగా సంక్షేమ పథకం ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా కోచ్ లకు 15 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని స్టేడియాల్లో వేసవి శిక్షణ శిబిరాలు, శిక్షణ కార్యక్రమాల కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, నాగరాజు, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బాక్సర్ల జోరు

నోయిడా: ప్రపంచ బాక్సింగ్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు తొలిరోజే అదరగొట్టారు. ఏడాది విరామం తర్వాత బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన ప్రీతి పవార్.. మహిళల 54 కిలోల విభాగంలో సెమీఫైనల్స్ చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. ఉమెన్స్ క్వార్టర్స్‌లో ప్రీతి.. నిగిన ఉక్తామొవ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించి సెమీస్ చేరింది. ఆమెతో పాటు 48 కిలోల విభాగంలో ప్రపంచ చాంపియన్ మీనాక్షి హుడా, పురుషుల క్యాటగిరీలో నరేందర్ (ం90 కిలోలు), అంకుష్ పంగల్ (80 కి.) సైతం సెమీస్ చేరారు.





# భారత్‌కు రెండో ఓటమి

బెంగళూరు: ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లేఆఫ్స్‌లో భారత్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా శనివారం స్లోవేనియా చేతిలో అపజయం పాలైన భారత్.. ఆదివారం తమ ఆఖరి మ్యాచ్‌లో 0-3తో నెదర్లాండ్స్ చేతిలోనూ ఓటమిపాలైంది.

మహిళల సింగిల్స్ విభాగాల్లో శ్రీవల్లి, సహజతో పాటు డబుల్స్‌లో అంకిత, ప్రార్థన సైతం తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# తిరువీర్ ప్రేమకథ

తిరువీర్ కథానాయకుడిగా మహేందర్ కుడుదుల దర్శకత్వంలో ఆధ్య మూవీ మేకర్స్ పతాకంపై పరుచూరి దర్శకుడు స్వరూప్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందిం చారు. అతిథులంతా చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు.




వెంకటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వివేక్ ఆత్రేయ క్లాప్ ఇవ్వగా, నిర్మాత దామోదర ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. తొలి సన్నివేశానికి తమ్మారెడ్డి భరద్వాజ గౌరవ దర్శకత్వం వహించారు. పల్లెటూరి నేపథ్యంలో సరదాగా, సందడిగా సాగే ప్రేమకథ ఇదని, ఇతర నటీనటులు, టెక్నీషియన్స్ వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి.

## ఒకరోజు ముందుగానే

రామ్ పోతినేని నటించిన మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ స్టార్ ఉపేంద్ర ఇందులో రియల్‌లైఫ్ సూపర్‌స్టార్‌గా నటించారు. మహేశ్‌బాబు.పి దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్టు గతంలో ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఒకరోజు ముందుగానే అంటే.. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఓ అభిమాని బయోపిక్‌గా తెరకెక్కిన సినిమా ఇదని, వేలాది అభిమానుల జీవితాలను ప్రతిబింబించే ఈ సినిమా ఆడియన్స్‌కి అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని మేకర్స్ తెలిపారు. భారతీయ సినీ చరిత్రలోనే కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా ఇదని, ఈ నెల 18న కర్నూల్‌లో భారీ పబ్లిక్ ఈవెంట్‌ని నిర్వహించనున్నామని నిర్మాతలు తెలిపారు. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.



## మరో ఛాన్స్.. కొట్టేసిన 'కోర్టు' భామ

ఇటీవల జో వంటి బ్లాక్ బస్టర్ చిత్రం అందించిన విజన్ సినిమా హౌజ్ బ్యానర్‌లో మరో ఆసక్తికరమైన చిత్రం తెరకెక్కుతుంది. అయితే ఇది తెలుగు, తమిళంలో ఏక కాలంలో రూపొందనుండడం విశేషం. ఇప్పటికే.. 'కోజిపన్నై చెల్లదురై', 'కానా కానమ్ కాలంగల్' వంటి చిత్రాల్లో అద్భుత నటనతో అందరినీ ఆకట్టుకున్న ఏగన్ హీరోగా నటిస్తుండగా, తెలుగు 'కోర్ట్' చిత్రంతో అందరినీ ఆకట్టుకున్న శ్రీదేవి 'మిన్నల్ మురళి' ఫేమ్ ఫెమినా జార్జ్ ఈ చిత్రంలో కథానాయికలుగా నటించనున్నారు.

ఈ సినిమాకు సంబంధించిన విషయాలు ఈ చిత్రం గురించి మేకర్స్ ఇటీవల అధికారికంగా ప్రకటించారు. గతంలో 'ఆహా కళ్యాణం' అనే తమిళ వెబ్ సిరీస్ డైరెక్ట్



చేసిన యువరాజ్ చిన్నసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండగా, తెలుగులో బేబీ, కోర్ట్ వంటి సినిమాలతో మంచి పేరు దక్కించుకున్న విజయ్ బుల్గానిన్ సంగీతం అందించనుండడం గమనార్హం.

'జో' విజయం తర్వాత మంచి కథలతో, కంటెంట్ డ్రివెన్ సినిమాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న నిర్మాతలు డా. డి. అరుళనందు, మాథ్యూయో అరుళనందు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే విధంగా ఎలాంటి రాజీ పడకుండా ఈ ప్రాజెక్ట్‌ను భారీగా నిర్మించనున్నట్టు తెలిపారు. తారాగణం, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలు, కథకు సంబంధించిన ముఖ్య సమాచారం, షూటింగ్ షెడ్యూల్ వంటి అంశాలను త్వరలోనే యూనిట్ అధికారికంగా ప్రకటించనుంది.

ఇదిలాఉంటే.. శ్రీదేవి ఇప్పటికే తమిళంలో రెండు, తెలుగులో ఓ రెండు చిత్రాలు చేస్తుండగా ఇప్పుడు మరో తమిళ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వరుస ఛాన్సులతో దూసుకుపోతుంది. మరి ఈ అమ్మడు ఏ రేంజ్‌లో తన టాలెంట్ చూపిస్తుందో ఎదురు చూడాల్సిందే.



## సిద్ధార్థ్ జోడీగా.. రాశీ ఖన్నా!

కోలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన కాంబినేషన్ తెరమీదకు వచ్చింది. లవర్ బాయ్ సిద్ధార్థ్ , రాశీ ఖన్నా జంటగా ఫస్ట్ టైం ఓ సినిమా రూపొందుతుంది. అంతేకాదు తొలిసారి నటించే చిత్రానికి 'రౌడీ అండ్ కో' అనే టైటిల్ ఖరారు చేశారు. సునీల్, యోగిబాబు, రెడిన్ కింగ్స్, ఫ్రాంక్ స్టార్ రాహుల్, వెత్రిమణి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

గతంలో సిద్దుతో టక్కర్ అనే డిఫరెంట్ చిత్రం తెరకెక్కించిన కార్తిక్ జి క్రిష్ దర్శకత్వం వహిస్తుండగా ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




సిద్దు, రాశీ ఖన్నా మొదటి సారి కలిసి నడుస్తుండడంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'ఇది రౌడీల కార్పొ రేట్ సామ్రాజ్యానికి సంబంధించిన స్టోరీ. అందుకే 'రౌడీ అండ్ కో' అనే టైటిల్ ఖరారు చేశాం. ఫుల్ లెంగ్త్ హాస్యభరితంగా తెరకెక్కిస్తున్నాం. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా మూవీగా రూపుదిద్దుకుంటుంది.

ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేశాం. మరో 15-20 రోజుల్లో పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేస్తాం. చెన్నైలో షూటింగ్ జరుపు కున్న ఈ చిత్రం అనేక సంక్లిష్ట సంఘటనలు, తద్వారా ఏర్పడే సమస్యలను ఎంతో ఫన్నీగా చిత్రీకరించాం' అని వివరించారు.



## వారికి మద్దతుగా నిలవాలి

'నేను నటిని మాత్రమే కాదు. ప్రస్తుతం తల్లిని కూడా. ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే ఈ రెండు బాధ్యతల్నీ విజయవంతంగా నిర్వర్తించొచ్చని కొందరు అంటున్నారు. కానీ వాస్తవానికి అది చాలా కష్టం. కొత్తగా తల్లి అయిన స్త్రీలను పని ఒత్తిడికి లోను చేయడం సమంజసం కాదు. ఈ విషయంలో అంతా సదరు స్త్రీలకు మద్ధతుగా నిలవాలి.' అని నటి దీపిక పదుకోణ్ అన్నారు. '8గంటల వర్కింగ్ అవర్స్' డిమాండ్‌తో కొన్ని నెలలుగా చర్చనీయాంశమయ్యారామె.

ఈ కారణంగా కొన్ని సినిమాలను కూడా ఆమె వదులుకున్నారు. రీసెంట్‌గా తన అభిప్రాయాన్ని సమర్థించుకుంటూ మళ్లీ మాట్లాడారు దీపిక. 'ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే అత్యుత్తమంగా పనిచేయగలం. ఒత్తిడికి లోనైతే అవుట్‌పుట్ కూడా సరిగ్గా రాదు. అందుకే.. నా సొంత ఆఫీస్‌లో కూడా నా ఉద్యోగులందరికీ సోమవారం నుంచి శుక్రవారం వరకూ రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పనిచేయిస్తాను. ఎవరికైనా సరే ఆరోగ్యమే ప్రధానం. దాన్ని కాపాడుకోవడమే అన్నింటికన్నా ముఖ్యం.' అని చెప్పుకొచ్చారు దీపిక పదుకోణ్.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305**, Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**